చలో బస్‌భవన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు, ఉద్యోగులు

ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర

- అద్దె బస్సులతో అధోగతి
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందే
- కార్మికులను అణచివేసే చర్యలు మానుకోవాలి
- 'చలో బస్‌భవన్'లో ఆర్టీసీ జేఏసీ నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ): ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు అద్దె బస్సుల పేరుతో ప్రభుత్వం, యాజమాన్యం కుట్ర చేస్తున్నదని ఆర్టీసీ జేఏసీ నేతలు విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో బస్‌భవన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని చెప్పి మరిచిపోయిందని తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ బాబు మాట్లాడుతూ మోటార్ వెహికిల్ ట్యాక్స్‌ల భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో ఆర్టీసీ డ్రైవర్ల సంఖ్యను పెంచితే తెలంగాణలో మాత్రం కుదిస్తున్నారని పేర్కొన్నారు. ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్ మాట్లాడుతూ కేంద్రం 44 చట్టాలను తీసేసి 4 కోడ్‌లుగా విభజించడాన్ని తప్పుపట్టారు. ఆర్టీసీలో 12 నుంచి 16 గంటల పాటు డ్యూటీ చేయిస్తూ యాజమాన్యం కార్మిక శ్రమశక్తిని దోచుకుంటున్నదని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొని ఆర్టీసీకి సరఫరా చేయాలని కన్వీనర్ మాలానా పేర్కొన్నారు. డ్రైవర్, కండక్టర్, మెకానికల్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కో-కన్వీనర్ కత్తుల యాదయ్య కోరారు. మహాలక్ష్మి పథకంలో మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ బదులు స్మార్ట్ కార్డు ఇవ్వాలని సుద్దాల సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు కమలాకర్‌రెడ్డి, బీ యాదగిరి, వివిధ జిల్లాల ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

తాగినడిపితే లైసెన్స్ రద్దే..

- అతివేగంగా, అధిక లోడ్‌తో వెళ్తే లైసెన్స్ క్యాన్సిల్
- నిబంధనలు మరింత కట్టుదిట్టం
- డేటాబేస్ ఆధునీకరణకు రవాణా, పోలీస్ శాఖల చర్యలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ): మద్యం తాగి వాహనం నడిపితే వాహనదారుడిపై కేసు నమోదుతో పాటు లైసెన్స్ రద్దు కానున్నది. అధిక వేగం, బరువుతో గూడ్స్ వెహికల్స్ నడిపినా లైసెన్స్ రద్దు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టనున్నారు. ఏడాదిలో రాష్ట్రంలో 15,209 లైసెన్సులను రవాణాశాఖ సస్పెండ్ చేసింది. ఇందులో ఎక్కువగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులే ఉన్నట్టు తెలిపారు. ఒకే వ్యక్తి మూడు సార్లు మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుపడితే లైసెన్సును సస్పెండ్ చేసేందుకు పోలీసులు రవాణాశాఖకు సిఫార్సు చేయనున్నారు. రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. లైసెన్స్ విధానాన్ని కట్టుదిట్టం చేసేందుకు రవాణా, పోలీస్ శాఖలు డేటాబేస్‌ను ఆధునికరించాలని యోచిస్తున్నాయి. పట్టుబడిన వ్యక్తి ఫోటో లేదా ఆధార్ నంబర్ డేటాబేస్‌తో కనెక్ట్ చేయడంతో లైసెన్సు నంబర్, ఎక్కడ తీసుకున్నది క్షణాల్లో అధికారులకు తెలిసిపోనున్నది. దీంతో రవాణాశాఖ సులభంగా లైసెన్స్ సస్పెన్షన్ చేపట్టనున్నారు.

ఎమ్మెల్యే ఆర్డర్..అనుమతులున్నా బుల్డోజర్

- విమర్శలకు తావిస్తున్న శేరిలింగంపల్లి జోన్ అధికారుల తీరు
- పర్మిషన్ ఉన్న స్థలంలోకి బుల్డోజర్లు.. పనుల అడ్డగింత
- అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో బిల్డర్ వేధింపులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో చెలరేగుతున్న ఓ అక్రమార్కుడితో చేయి కలిపి శేరిలింగంపల్లి జోన్ అధికారులు ప్రవర్తిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. కష్టార్జితంతో ఇల్లు కట్టుకునేందుకు అన్ని అనుమతులు పొందిన ఓ యజమానిని వివాదస్పద బిల్డర్ కోసం వేధించడం చర్చనీయాంశమవుతున్నది. గచ్చిబౌలి ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కాలనీ సర్వే నంబర్ 124,125, ప్లాట్ నంబర్ 84లోని 708 గజాల స్థలాన్ని వీ దేవరాజ్, వీ కల్యాణి పేరుతో 2022 సంవత్సరంలో జీహెచ్‌ఎంసీకి నిర్మాణ అనుమతికి దరఖాస్తు చేసుకున్నారు. అంతా పరిశీలించాక టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతి మంజూరు చేశారు. దీంతో ఇటీవల దేవరాజ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇదే కాలనీ హౌజింగ్ సొసైటీపై పెత్తనం చలాయిస్తున్న బిల్డర్ శ్రీధర్‌రావు కన్ను ఈ స్థలంపై పడింది. అక్కడి నుంచి పనులను అడ్డుకోవడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో దేవరాజ్ గత నెల 27న శ్రీధర్‌రావుపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీంతో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ సీనియర్ ఎమ్మెల్యే(అధికారపార్టీ) అండతో శ్రీధర్‌రావు చెలరేగిపోయాడు. ఆయన ఆదేశాలతో అధికారులు దేవరాజ్ నిర్మాణ స్థలంలో ఫెన్సింగ్‌ను జేసీబీతో తొలగించారు. ఇందేంటని ప్రశ్నిస్తే తమకు ఫిర్యాదు అందిందని అనుమతినిచ్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులు చెప్పడం కొసమెరుపు. ఈ క్రమంలో దేవరాజ్‌పై తరచూ వేధింపులు ఎక్కువయ్యాయి. అన్ని అనుమతులతో నిబంధనలకు అనుగుణంగా పనులు మొదలుపెడితే కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని దేవరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఎఫ్‌సీఐ కాలనీలో నిర్మాణ పనులు అడ్డుకుని, ఫెన్సింగ్ తొలగిస్తున్న అధికారులు

'మెగాఫుడ్ పార్క్' సభ వెలవెల

- పాగడ్తలకే పరిమితమైన మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల ప్రసంగం
- విసుగెత్తిన ప్రజలు.. సభ మధ్యలో నుంచి వెళ్లిపోయిన వైనం

పెనుబల్లి (సత్తుపల్లి), డిసెంబర్ 5 : ఖమ్మం జిల్లా బుగ్గపాడులో గురువారం జరిగిన మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒకరినొకరు పొగుడుకోవడమే పనిగా పెట్టుకున్నారు. దీంతో విసుగెత్తిన ప్రజలు సభ నుం లేచిపోవడంతో ఖాళీ కుర్చీలే మంత్రుల ప్రసంగాన్ని వినాల్సి వచ్చింది. ముఖ్యఅతిథిగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకాగా.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. మంత్రులు ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకోవడంతో ప్రజలు వెళ్లిపోయారు.

సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతుండగా మధ్యలోనే వెళ్లిపోతున్న కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

హోంగార్డులకు నో 'రైజింగ్'

- ఏటా జరిగే కార్యక్రమాలకు సైతం మంగళం
- అడ్రస్‌లేని కవాతు, స్పోర్ట్స్‌మీట్, ప్రశంసాపత్రాలు
- అమరజవాన్ల త్యాగాలను అవమానించినట్టే
- నేడు హోంగార్డుల 75వ రైజింగ్‌డే

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఓ వైపు రాష్ట్రంలో 'తెలంగాణ రైజింగ్' పేరిట వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ 75వ రైజింగ్‌డేను గాలికి వదిలేసిందని హోంగార్డులు వాపోతున్నారు. దేశంలో హోంగార్డుల వ్యవస్థ ప్రారంభమై 75 ఏండ్లు పూర్తికావొస్తున్న సందర్భంగా.. డిసెంబర్ 6న ఎంతో ఘనంగా నిర్వహించాల్సిన స్వర్ణోత్సవాలను ప్రభుత్వం, పోలీసుశాఖ గాలికి వదిలేసినట్టు తెలుస్తున్నది. ఒక్క రక్తదానం మినహా ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర హోంశాఖ సిద్ధంగా లేదని రాష్ట్రంలో హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోంగార్డుల రైజింగ్‌డే రోజున ప్రతియేటా కవాతు, స్పోర్ట్స్‌మీట్స్ నిర్వహించి తమను ప్రోత్సహించేవారని, ఆయా విభాగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి రివార్డులు, ప్రత్యేకంగా ప్రశంసాపత్రాలు ఇచ్చేవారని, ఆరోజు తమకు భోజన ఏర్పాట్లు కూడా చేసేవారని చెప్తున్నారు. తాము ఎంతగానో నమ్మకం పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఇలా గాలికి వదిలేయడం ఆవేదనకు గురిచేస్తున్నదని అంటున్నారు. ఇది విధి నిర్వహణలో ప్రాణత్యాగాలు చేసిన వారిని అవమానించడమేనని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక సర్క్యూలర్ విడుదల చేసి, అన్ని జిల్లాల్లో ఘనంగా హోంగార్డుల రైజింగ్ డేను నిర్వహించాలని వారు కోరుతున్నారు.

హోంగార్డుల సమస్యలపై పట్టింపేది?

'అటెండర్‌కు ఎక్కువగా.. పోలీసుకు తక్కువగా' డ్యూటీలు చేస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపులేదని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా పెండింగ్‌లో ఉన్న యూనిఫాం అలవెన్స్‌ను వెంటనే ఇవ్వాలని, ఆర్డర్లీ వ్యవస్థను తొలగించాలని, 600కు పైగా ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు. అలాగే హోంగార్డుల సాధారణ మరణానికి రూ.5 లక్షల నగదు ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చినట్టు ఇవ్వాలని, రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక భరోసా కల్పించాలని, ఆరోగ్య భద్రత తమకు కూడా వర్తింపచేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

ద్రోహి సమాచారంతోనే ఎన్‌కౌంటర్

- విషమిచ్చి, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు
- కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు బాధ్యత వహించాలి
- మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్
- 9న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు

ములుగు, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఈ నెల 1న ములుగు జిల్లా చెల్పాక వద్ద గ్రేహౌండ్స్ పోలీసులు ఏడుగురు మావోయిస్టులకు విషమిచ్చి చంపారని భారత కమ్యూనిస్టుపార్టీ (మావోయిస్టు) రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 30న ఏడుగురితో ఉన్న దళం చెల్పాక పంచాయతీలోని వలస ఆదివాసీ గ్రామంలో నమ్మిన వ్యక్తికి భోజనాలు ఏర్పాటు చేయమని కోరారని తెలిపారు. అప్రూవర్‌గా మారిన ఇన్ఫార్మర్ ద్వారా భోజనంలో విషం కలిపి స్పృహ కోల్పోయేలా చేశారని చెప్పారు. చిత్రహింసలు పెట్టి తెల్లవారుజామున 4 గంటలకు కాల్చి చంపారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హత్యాకాండను నిరసిస్తూ ఈ నెల 9న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్టు వెల్లడించారు. ప్రజాస్వామికవాదులు, విద్యాలయాలు, వ్యాపారసంస్థలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వం, బాధ్యత వహించి, న్యాయ విచారణ జరిపి పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మాజీ సర్పంచ్‌ల హత్య

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 5 : మావోయిస్టులు ఇద్దరు మాజీ సర్పంచ్‌లను దారుణంగా హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో గురువారం వెలుగుచూసింది. బీజాపూర్ జిల్లాకు చెందిన మాజీ సర్పంచ్‌లు సుఖ్‌రామ్ ఆవ్‌లం, సుక్లు ఫర్సాను మావోయిస్టులు మంగళవారం అర్ధరాత్రి అపహరించుకెళ్లారు. పార్టీకి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నారనే నెపంతో వారిని హత్య చేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ ఘటన బైరామ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

ఇచ్చోడ గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక

ఇచ్చోడ, డిసెంబర్ 5 : ఇచ్చోడ గ్రామాభివృద్ధి కమిటీని గురువారం షార్ప్ గార్డెన్‌లో ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా అన్నెల లక్ష్మణ్, అధ్యక్షుడిగా పెరుమండ్ల నారాయణ, ఉపాధ్యక్షులుగా గుమ్మడి భీమిరెడ్డి, అబ్దుల్, సాబీర్, జలైజాకు, గొలుసుల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా రేణిగుంట సురేశ్, కోశాధికారిగా వేణుగోపాలచారి, ఉపకార్యదర్శిగా ధరావత్ నరేందర్, చింతల స్వామి, హైదరాజేశ్వర్, పెంటన్నతోపాటుగా మరో 25 మందిని వివిధ భాగాల్లో ఎన్నుకున్నారు. ఇక్కడ ఇచ్చోడలోని అన్ని వర్గాల ప్రధాన నాయకులు, ఆయా కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కలశ పూజ చేసేందుకు వెళ్తున్న లింబాజీ మహారాజ్, భక్తులు

కైలాష్ టెకిడి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

బోథ్, డిసెంబర్ 5 : బోథ్ మండలంలోని నిగిని అటవీ ప్రాంతంలో శ్రీశిఖర్ కైలాష్ టెకిడిపై కొలువై ఉన్న నర్మదేశ్వర్ ఆలయ 22వ వార్షికోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకులు శ్రీ సంత్ లింబాజీ మహారాజ్ ఆధ్వర్యంలో వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజున శోభాయాత్ర, గణపతి, గో పూజ, యగాశాల వ్యవస్థీకరణ, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మొదట కలశ స్థాపన కోసం సమీ పంలోని కుంట నుంచి మహారాజ్ ప్రత్యేక పూజల అనంతరం నీటిని తీసుకువచ్చారు. ఆలయంలో శివలింగానికి నంది విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు.

శాంతిభద్రతల కోసమే 'కమ్యూనిటీ కాంటాక్ట్'

పెంబి, డిసెంబర్ 5: శాంతిభద్రతల పరిరక్షణ కోసమే గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. గురువారం మందపల్లిలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా 76 బైక్‌లు, రెండు కార్లు స్వాధీనం చేసుకోని ద్రువ పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహన చోదకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనపత్రాలు కలిగి ఉండాలన్నారు. అనంతరం మందపల్లి కేజీబీవీ పాఠశాలలో సైబర్ నేరాలు, మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సాయికుమార్, శంకర్, కృష్ణాసాగర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న వాహనాలు

ఆరోగ్య పాఠశాలతో విద్యార్థుల్లో మార్పు

ఎదులాపురం, డిసెంబర్ 5 : ఆరోగ్య పాఠశాల ప్రారంభించిన 22 రోజుల్లోనే విద్యార్థుల్లో గణనీయమైన మార్పు వచ్చిందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. విద్యార్థుల మంచి భవిష్యత్తుకు రేపటి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కలెక్టర్ రూపొందించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్టూడెంట్ చాంపియన్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యార్థుల్లో పొగాకు, గుట్కా తినేవారు సైతం ఇక నుంచి వాటి జోలికి వెళ్లమని ప్రతిజ్ఞ చేశారని వివరించారు. ఈ సందర్భంగా స్టూడెంట్ చాంపియన్స్‌కు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రతి విద్యార్థికి చేరువయ్యేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ఆరోగ్య పాఠశాల ద్వారా ప్రతి విద్యార్థుల్లో అవగాహన కలగాలని ఆన్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, ఎంఈవోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్స్ అందజేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బాధిత కుటుంబానికి పరామర్శ

తలమడుగు, డిసెంబర్ 5 : మండలంలోని భరంపూర్‌కు చెందిన జావిద్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందారు. గురువారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు కేదారేశ్వర్ రెడ్డి, లస్మన్న, మల్లేశ్, రమాకాంత్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్‌పోటీల్లో కాంస్య పథకాలు సాధించిన క్రీడకారులు

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో కేజీబీవీ విద్యార్థులు

దిలావర్‌పూర్ డిసెంబర్ 5 : మండల కేంద్రమైన దిలావర్‌పూర్‌లోని కస్తూర్బాగాంధీ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ కనబర్చినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో భాగంగా ఈనెల 2వ తేదీ నుంచి 4వ తేదీల్లో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో ఎం రమ్య, బీ స్నేహ, యస్ అక్షర, ఎస్ అడిల్లాలు కాంస్య పథకం సాధించారు. విద్యార్థులను గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కాంస్య పథకాలు సాధించిన కేజీబీవీ విద్యార్థులను ఏంఈవో శంకర్ అభినందించారు.

నూతన పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించాలి

ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఇచ్చోడ, డిసెంబర్ 5 : జిల్లాకు వచ్చిన నూతన పోలీసు కానిస్టేబుళ్లకు పోలీస్ స్టేషన్ నిర్వహణపై పూర్తి అవగాహన కల్పిస్తూ విధులను సక్రమంగా నిర్వర్తించేలా చూడాలని అధికారులను ఎస్పీ గౌస్‌ఆలం సూచించారు. గురువారం ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ భీమేష్, ఎస్ఐ తిరుపతి సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతున్న నలుగురి అరెస్టు

● 500 గ్రాములు స్వాధీనం ● రూరల్ సీఐ కే ఫణిదర్

ఎదులాపురం, డిసెంబర్ 5 : తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని దురాశతో గంజాయి అమ్ముతున్న నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ కె.ఫణిదర్ తెలిపారు. గురువారం మావల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విష్ణువర్ధన్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బేల మండలానికి చెందిన తుమ్రం దేవ్‌రావు తన చేనులో పండించిన గంజాయిని తీసుకొచ్చి ఆదిలాబాద్ పట్టణంలో బాలాజీ నగర్ వద్ద రూరల్ మండలంలోని బంగారిగూడ గ్రామం, కుమ్రె లక్ష్మణ్, కేఆర్‌కే కాలనీకి చెందిన మందసురేశ్, ఫిల్టర్ బెడ్‌కు చెందిన ఓవైసీ హుస్సేన్‌కు కిలో రూ.10 వేలు చొప్పున అమ్ముడానికి మాట్లాడుకున్నారు. గంజాయిని అమ్ముతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు మావల ఎస్ఐ, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మొబైల్ ఫోన్లను 500 గ్రాముల గంజాయిని రూ.1500 నగదు స్వాధీనం చేసుకొని మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. గంజాయి అమ్మినా, రవాణా చేసిన, పండించిన వారిపై మాదకద్రవ్యాల కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

విద్యాశాఖ కమిషనర్ ఆకునూరి మురళి

ముధోల్, డిసెంబర్, 5 : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించినప్పుడు వారు ఉన్నత స్థాయిలో నిలుస్తారని విద్యాశాఖ కమిషనర్ ఆకునూరి మురళి అన్నారు. గురువారం ముధోల్‌లోని ప్రభుత్వ ఉన్నత, మైనార్టీ గురుకుల పాఠశాలలను కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యతోపాటు క్రీడల గురించి ఎంఈవో రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఖుస్రును అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించి బోధన తీరును పరిశీలించారు. మైనార్టీ గురుకులంలో స్టోర్ రూమ్, డార్మెటరీ హాల్‌ను పరిశీలించి బియ్యం, పప్పులను తనిఖీ చేశారు. ఇక్కడ వెంట ఆర్డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, జిల్లా విద్యాధికారి రామారావు, ఎంపీడీవో శివకుమార్, సీఐ మల్లేశ్, ఆయా శాఖల అధికారులున్నారు.

శబాష్ ఎస్పీ గారు..

జిల్లా ఎస్పీని అభినందించిన విద్యాకమిషన్ చైర్మన్

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 5 : నిర్మల్ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని ఎస్పీ జానకి షర్మిల గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విద్యార్థులకు అండగా నిలిచేందుకు ట్రిపుల్ ఐటీని దత్తత తీసుకుని చేపట్టిన చర్యలను ఆయనకు వివరించారు. విద్యార్థులకు అండగా నిలిచేందుకు కృషి చేస్తున్న ఎస్పీని అభినందించారు.

హాఫీజ్ మారిన ఇద్దరు చిన్నారులకు సన్మానం

ఎదులాపురం, డిసెంబర్ 5 : ఆదిలాబాద్ పట్టణం భుక్తాపూర్ దారుల్ ఉలూమ్ మొహ్మదియ మదర్సాలో చిన్న వయసులోనే ఖురాన్‌ను కంఠస్థం చేసి హాఫీజ్ మారిన ఇద్దరు చిన్నారులను నిర్వాహకులు గురువారం ఘనంగా సత్కరించారు. ఖుర్షిద్‌నగర్‌కు చెందిన ఎండీ హుఫేజా(13), ఎండీ ఫర్హాన్(12)లు దివ్య ఖురాన్‌ను కంఠస్థం చేసిన వారిలో ఉన్నారు. తల్లిదండ్రుల సమక్షంలో వారిని నిర్వాహకులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించి మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో మదర్సా నిర్వాహకులు షేక్ అహ్మద్, మౌలానాలు హఫీజ్, జఫర్, ఇస్లామ్ ఉద్దీన్, ఖమర్ పాల్గొన్నారు.

మహిళ ను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

బోథ్, డిసెంబర్ 5 : మహిళను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య ఉద్దేశమని డీఆర్డీఏ ఐకేపీ సంస్థాగత నిర్మాణ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ టీ హేమలత అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు మండలంలోని 42 గ్రామ సంఘాలతో సమావేశం నిర్వహించారు. మహిళల కోసం ప్రవేశ పెట్టిన పథకాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో డీపీఎం ఐబీ పీ హేమలత, ఏపీఎం మాధవ్, సీసీలు సంజీవ్, ఎం గంగాధర్, బీ గంగాధర్, శకుంతల, సుభద్ర, లక్ష్మయ్య, పోసాని, విజయలక్ష్మి, వీవోఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పిల్లవాడిలో నైపుణ్యం దాగి ఉంటుంది

ఎదులాపురం, డిసెంబర్5: ప్రతి పిల్లవాడిలో ఏదో ఒక టాలెంట్ దాగి ఉంటుందని, దానికి వైకల్యం అడ్డుకాకూడదని డీఈవో టీ ప్రణీత అన్నారు. గురువారం భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి డీఈవో అథితిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కేంద్రం చిన్నారులు నృత్యాలు, పాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా డీఈఓ ప్రణీత మాట్లాడుతూ, భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల గల విద్యార్థులపై శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సోమయ్య, సెక్టోరియల్ అధికారులు కంటే నర్సయ్య, సూజత్ అలీ, కిరణ్, కేంద్రం ఐఈఆర్పీలు కృష్ణవేణి, రాజన్న, గంభీర్, నరేశ్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంట్లోకి చొరబడ్డ అడవి పంది

బోథ్, డిసెంబర్ 5 : మండలంలోని కౌర(బీ) గ్రామంలో గురువారం ఓ అడవి పంది ఇంట్లోకి చొరబడి, నానా హంగామా చేసింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి, కొత్త కాలనీకి చెందిన చిరు వ్యాపారి కుమ్మరి లస్మన్న ఇంట్లోకి అడవి పంది చొరబడింది. పక్కనున్న పొలాల నుంచి గుంపుగా ఉన్న అడవి పందులు గ్రామంలోకి వస్తుండగా చూసిన కొంత మంది కేకలు వేశారు. దీంతో ఓ పంది ఇంట్లోకి చొరబడింది. ఇంట్లోవారు కేకలు వేయడంతో గ్రామస్తులు చేరుకొని అడవి పందిని బయటకు పంపేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. ఒకరిద్దరికి స్వల్పగాయాల య్యాయి. గ్రామస్తులు బండ రాళ్లు, కర్రలతో అడవి పందిని చంపేశారు.



ఇంట్లోకి